చివరి ఆయకట్టుకు సాగునీరు అందేనా?

- ఎండిపోతున్న కుంటలు, చెరువులు
- పొడిబారుతున్న వరిపొలాలు
- ఆందోళనలో రైతన్న



సాగునీరు అందక పొడిబారుతున్న వరి

విసంపేట గ్రామానికి చెందిన బోడకుంట లచ్చయ్య తనకున్న రెండెకరాల్లో వరిసాగు చేస్తున్నాడు. అప్పటికే చివరి ఆయకట్టుకు సాగునీటి సరఫరా ఆశించిన స్థాయిలో లేదు. వ్యవసాయ బావిలో కూడా నీరు అడుగంటిపోయింది. దీంతో బోరుకు అందడం లేదు. రూ.30వేల పెట్టుబడి పెట్టి వరిసాగు చేశాడు. సమృద్ధిగా నీరందకపోవడంతో వరిపైరు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నాడు. ఇది ఒక లచ్చయ్య సమస్యనే కాదు. చివరి ఆయకట్టు రైతులందరిదీ ఇదే సమస్య.



ఎండిపోయిన గానుకుంట

రామగుండం: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడుగంటుతున్న భూగర్భజలాలు, నిలిచిపోయిన ఎత్తిపోతలు, శిథిలావస్థకు చేరిన ఎస్సారెస్పీ కాలువలు.. ఫలితంగా చివరి ఆయకట్టు గ్రామాలైన పాట్యాల, విసంపేట, మద్దిర్యాల శివారుల్లోని పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. వందలాది ఎకరాల వరిపొలాలు పొట్ట దశకు చేరాయి. సాగునీరందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే సాగు దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు.

ఎండుతున్న కుంటలు, చెరువులు

ఆయా గ్రామాల్లోని కుంటలు, చెరువులు ఎండిపోతున్నాయి. వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి మోటార్లకు అందడం లేదు. విసంపేట గ్రామ శివారులో ఉన్న అట్లకుంట ఇప్పటికే ఎండిపోయింది. కనీసం ఎస్సారెస్పీ నీటితో అట్లకుంటను నింపితే సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు నీటి అవసరాలు తీరుతాయి. బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలు ప్రారంభమైతే డీ–83 నుంచి 27/ఎల్ మీదుగా సరఫరా అయ్యే నీరు 8ఎల్ కాలువ ద్వారా విసంపేట, మద్దిర్యాలకు అందనుంది. ఎస్సారెస్పీ కాలువలు శిథిలావస్థకు చేరడంతో చివరి ఆయకట్టుకు నీటి సరఫరా జరగడం లేదు.

కాలువలు పునరుద్ధరించాలి



ఎస్సారెస్పీ కాలువల పునరుద్ధరణ పనులు చేపడితేనే చివరి ఆయకట్టు గ్రామాలకు సాగునీటి సరఫరా సాఫీగా జరుగుతుంది. గ్రామశివారులో ఉన్న కుంటలు, చెరువులు నిండితే భూగర్భజలాలు పెరుగుతాయి. బావుల్లో నుంచి మోటార్లతో నీటిని ఎత్తిపోసుకునే వీలుంటుంది. అధికారులు ఎస్సారెస్పీ కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టాలి. – జర్పటి సురేశ్, రైతు, విసంపేట

క్లుప్తంగా

సీఎస్పీలో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 సీఎస్పీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీఎస్పీలో డస్ట్ సమస్య పరిష్కరించాలని, టెక్నీషియన్ల కొరతతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక వాష్ రూమ్స్ నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ నాయకులు పోచయ్య, సదానందం, వికాస్ కుమార్‌యాదవ్, పుట్ట రమేశ్, కుమారస్వామి, మురళి, బొల్లి సమ్మయ్య, విక్రమ్, రవీందర్, మహేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 22ను గెజిట్ చేసి అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సివిక్ జోన్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 22ను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసి కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరిగేలా వేతనాలు పెంచాలని కోరారు. జీవో నెంబర్ 22 గెజిట్ చేసి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మి, సమ్మయ్య, కవిత, జలపతి నాయక్, బుజ్జమ్మ, శేఖర్, రాజన్న పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

రామగిరి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా గృహజ్యోతిలో జీరో బిల్లు రాని లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆరు గ్యారంటీలలో భాగంగా దరఖాస్తు చేయని వారి కోసం ప్రజాపాలన సేవాకేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల, ఇదులాపూర్ గ్రామాల్లో మంగళవారం ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ రావి సదానందం మంగళవారం ప్రారంభించారు. పందిల్ల గ్రామంలో రూ.5లక్షలు, ఇదులాపూర్ రూ.5లక్షలు ఈజీఎస్ నిధులతో ఈ పనులు పూర్తి చేయనున్నట్లు ఎంపీటీసీ పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే విజయరమణారావుకు, సహకరించిన మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, మహేందర్, మొగిలయ్యగౌడ్, కొమురయ్య, కిరణ్, కుమారస్వామి, సతీశ్, మల్లేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లోనే హాజరు వేయాలి



మాట్లాడుతున్న పీడీ రవీందర్

కమాన్‌పూర్: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ప్రదేశాల్లోనే మేట్లు మస్టర్ రోల్‌లో కూలీల హాజరు వేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి పీడీ రవీందర్ ఆదేశించారు. మండలంలోని జూలపల్లి గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీడీ కూలీలతో మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు ఉదయం పని స్థలాలకు చేరుకొని పనులు చేసుకొని ఇంటికి వెళ్లాలని సూచించారు. వన నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ఉదయం సాయంత్రం నీరు పట్టాలన్నారు. పీడీగా బాధ్యతలు చేపట్టి మండలానికి వచ్చిన పీడీని ఏపీవో లావణ్యతో పాటు సిబ్బంది సన్మానించారు. ఏపీడీ సత్యనారాయణ, కార్యదర్శి వెంకటరమణ, జేఈ కృష్ణస్వామి ఉన్నారు.

శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు



కాల్వశ్రీరాంపూర్ జ్ఞానమౌనీశ్వరాలయం



జూలపల్లి: శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్టపై శ్రీజ్ఞానమౌనీశ్వరాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 7వ తేదీ నుంచి 8 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 7న 5 గంటలకు సుప్రభాతసేవ, పంచపల్లవ తోరణాలంకరణ, వేద పఠనం, మూలవిరాట్‌లకు అభిషేకాలు, 6గంటలకు ఆలయ పీఠాధిపతులు శ్రీబసవత్తుల రాజమౌళి ఆచార్యులకు పూర్ణకుంభ స్వాగతం, 9గంటలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం, నివేదన, రుద్ర హోమం, మంగళహారతులు, తీర్థప్రసాద వితరణ ఉంటుంది. 8న 4గంటలకు సుప్రభాత సేవ, ప్రభాతభేరి, 8గంటలకు మంటప పూజలు, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి ద్వాదశనామాక్షర మూల మంత్ర హవనం, ఉదయం 10:51 నిమిషాలకు అభిజిత్ లగ్న పుష్కాంశ సుముహూర్తాన శ్రీగోవిందమాంబ–వీరబ్రహేంద్ర స్వామివార్ల కల్యాణం, మధ్యాహ్నం 3గంటలకు నాకబలి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి డోలోత్సవం, చందనగోష్టి, పల్లకిసేవ, బలిహరణ, స్వస్తిమంత్రార్థ, రాత్రి 8గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, అర్ధరాత్రి 12గంటలకు లింగోద్భవ సమయంలో మహాన్యాసక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు ఉంటాయని నిర్వాహకులు వివరించారు.

కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

జూలపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయాలను ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, వడ్కాపూర్ శివాలయం, తేలుకుంట రామప్ప ఆలయంలో శివపార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు.



యైటింక్లయిన్‌కాలనీ: కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రాజమౌళి

శ్రీవిశ్వకర్మ శివాలయంలో..

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ ఏరియాలోని శ్రీవిశ్వకర్మ శివాలయంలో 8న మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మారుపాక శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ నాగులమల్యాల రాజమౌళి ఆచార్యులు పేర్కొన్నారు. అనంతరం పూజలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రచారి, ప్రకాశ్‌చారి, శంకరయ్యచార్యులు, సత్యనారాయణ, సదానందం, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోచింగ్ వినియోగించుకోండి

గోదావరిఖని: స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా అందించే ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని సూచించారు. 38 వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కాస్మోటాలజీ(మహిళలు), డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్‌అండ్‌గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులతో పాటు పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తారనని వివరించారు.

ఐఎన్‌టీయూసీ నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ ఐఎన్‌టీయూసీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ నేతృత్వంలో నూతన కమిటీని ఎన్నుకోగా ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడిగా కోట రవీందర్‌రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శులుగా నరెడ్ల శ్రీనివాసరావు, సత్రం సమ్మయ్య, కె.సాయికృష్ణ, టి.మల్లిక, కోశాధికారిగా కొలిపాక సారయ్య, బ్రాంచ్ సలహాదారులుగా దామోదర్ రావు, ఆర్.శ్రీనివాస్, ఆఫీస్ సెక్రటరీగా డి.మంగయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాళ్లబండి రవీందర్, బ్రాంచ్ సహాయ కార్యదర్శులుగా పీవీ గౌడ్, సందెల కుమార్, కోలా అనిల్, ముప్పిడి శ్రీనివాస్, కండె రవీందర్, కారుపాక సుధాకర్, డిపార్ట్‌మెంటల్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మర్రి ఓదెలు, తాళ్లపల్లి నారాయణ, ఎంఎఫ్ కెన్ని, కెఎన్ చారి, బి.సదానందం, ఎండీ జుబేర్, సయ్యద్ సలీం, ఆర్.శ్రీనివాసచారి, ప్రేమ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



వివరాలు తెలుసుకుంటున్న సీఐ రవీందర్

కమాన్‌పూర్: కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను గోదావరిఖని టూటౌన్ సీఐ రవీందర్ మంగళవారం సందర్శించారు. పెండింగ్ కేసులు, ఇతర వివరాలను ఎస్సై చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, అసాంఘిక కార్యకలాపాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

బిరుదు ఆశయాలను కొనసాగిద్దాం

సుల్తానాబాద్: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఆశయాలను కొనసాగిద్దామని రిటైర్డ్ ఎస్పీ ఉప్పు తిరుపతి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో బిరుదు రాయమల్లు స్మారకార్థం వాలీబాల్ క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. బిరుదు రాజమల్లు సతీమణి సుశీల, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, మాజీ జెడ్పీటీసీ సారయ్యగౌడ్, కల్లెపల్లి జానీ, బిరుదు కుటుంబ సభ్యులు రాధాకృష్ణ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫర్నీచర్ వితరణ

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫర్నీచర్ అందజేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వివాహ వార్షికోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో కేక్ కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కన్నాల సింగిల్‌విండో డైరెక్టర్ తొగరి తిరుపతి ఆధ్వర్యంలో కేంద్రానికి కావాల్సిన ఫర్నీచర్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా జాయింట్ సెక్రటరీ గౌసియాబేగం, నాయకులు దేవీ లక్ష్మీనర్సయ్య, మల్లేషం, షబానాబేగం, శోభారాణి, రమ్య, మౌనిక, సలీం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాలకుర్తి: మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో శశికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వ్యాళ్ళ అనసూర్య అధ్యక్షతన ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండల పరిధిలోని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల మండల, గ్రామస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో శశికళ కోరారు.

ఆధునిక సాగుపై అవగాహన

పాలకుర్తి: మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించే కార్యక్రమం బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి ప్రకాశ్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తారని, మండల పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రామగిరి: రామగిరి పోలీసుస్టేషన్ పరిధిలోని సెంటనరీకాలనీకి చెందిన ఎరాసు అనిల్ శ్రీనివాస్‌రెడ్డి ఫోన్ ఎక్కడో పడిపోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం బాధితుడికి పోలీసుస్టేషన్‌లో సిబ్బంది ఫోన్ అప్పగించారు.

ముగింపు సభలను విజయవంతం చేయండి

పెద్దపల్లిరూరల్: పౌరహక్కుల సంఘం ఆవిర్భవించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సభల ముగింపు ఉత్సవం 9, 10వ తేదీల్లో జరుగుతుందని పౌరహక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి, రాజగోపాల్, సుచరిత తెలిపారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ముగింపు సభలకు తరలిరావాలని కోరారు. నాయకులు వినోద్, రవి, రాజలింగు, సత్యనారాయణ, మార్వాడీ సుదర్శన్, బాలసాని రాజయ్య, హుస్సేన్, రాజయ్య, గాండ్ల మల్లేశం, రాజన్న, కుమార్, రమేశ్, శశికుమార్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన

రామగిరి: మండలంలోని కల్వచర్లలో గల ఆయిల్ పామ్ తోటలను మంగళవారం హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్ పరిశీలించారు. గ్రామానికి చెందిన తోట శంకర్ తన ఎకరన్నర పొలంలో ఆయిల్ పామ్ పంట సాగుచేస్తున్నారు. పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్లు అనిల్, ప్రీతం, రైతులు రమేశ్, రాజు, గోవిందం పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీ ఆఫీసుల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించేలా చూడాలంటూ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి ఖాజా కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపిఓ సుదర్శన్ కు వినతి పత్రం అందించారు. నాయకులు నరేశ్, అశోక్, నర్సయ్య, మల్లేశ్, శ్రీను, ప్రణయ్, సందీప్, సంపత్ ఉన్నారు.

మహిళా దినోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సేవా సమితి అధ్యక్షురాలు అలివేణి

రామగిరి: సెంటనరీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 11న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని ఆర్జీ–3 సింగరేణి సేవాసమితి అధ్యక్షురాలు ఎస్.అలివేణి, ఏపీఏ జీఎం సతీమణి కె.విజయలక్ష్మి కోరారు. మంగళవారం సింగరేణి సేవా భవన్‌లో సింగరేణి సేవాసమితి సభ్యులతో వేడుకల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, సింగరేణి మహిళా ఉద్యోగులు, గృహిణులకు వివిధ ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 11న సెంటనరీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉత్తమ మహిళలకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సేవా సభ్యులు, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, కోఆర్డినేటింగ్ అధికారి గుర్రం శ్రీహరి, సేవా కార్యదర్శి మల్లీశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సేవా కోఆర్డినేటర్ బి.రాయమల్లుతో పాటు సేవా సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సెట్ ఏర్పాటు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓ రైతువేదికను ఎంపిక చేసి ఆధునిక సాంకేతికతతో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి తెలిపారు. జిల్లాలోని కమాన్‌పూర్ మండలం గుండారం, రామగుండం మండలం ఎల్కలపల్లి, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సెట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాలను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం వర్చువల్ పద్ధతిన ప్రారంభిస్తారని డీఏవో ఆదిరెడ్డి తెలిపారు. విత్తన ఎంపిక, చీడపీడల నివారణ, విత్తన శుద్ధి, మార్కెటింగ్ తదితర అంశాలపై వారానికి రెండుసార్లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం



అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: మనిషి మరణం శరీరానికే తప్ప నేత్రాలకు కాదని, మరణానంతరం నేత్రాలు మరొకరికి చూపునిస్తాయని నమ్మి... తమ తల్లి నేత్రాలను కొడుకులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. గోదావరిఖనిలోని విజయ్‌నగర్‌కు చెందిన గుండేటి యశోద(61) ఈ నెల 2న రోడ్డు ప్రమాదానికి గురైంది. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. బల్దియా కార్పొరేటర్ అయిత శివకుమార్, నాయకుడు బొల్లెన శ్రీధర్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఆమె కుమారులు నాగరాజు, కృష్ణ, క్రాంతికుమార్ ఆమె నేత్రాలు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ సహకారంతో మృతురాలి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. అభినందన పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉద్యమకారుల కృతజ్ఞత సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉద్యకారులు

ఎలిగేడు: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 12న తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ అధ్యక్షతన సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు బింగి రాజు కోరారు. మంగళవారం ఎలిగేడులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం తమ జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం 250గజాల ఇంటిస్థలం ఇవ్వడంతోపాటు ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని నిలబెడతామని ప్రకటించడం సంతోషకరమన్నారు. కృతజ్ఞత సభకు ఉద్యమకారులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కవ్వంపల్లి శ్రావణ్, కవ్వంపల్లి రాము, యాసాల శ్రీనివాస్, ముంజంపల్లి లక్ష్మన్, ఇరుకుల్ల రవి, మద్దెల సంజీవ్, బంగ్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాలకు నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంథని: నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండలాల్లో బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని బీసీ నాయకులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. నియోజకవర్గంలోని కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం, మల్హర్, కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో ఇప్పటి వరకు బీసీ కమ్యూనిటీ హాల్‌లు లేకపోవడంతో తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్, డివిజన్ అధ్యక్షుడు మాచిడి రవితేజగౌడ్, నాయకులు గుంజపడుగు రవి, బండారి ప్రసాద్, ఐలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

సుల్తానాబాద్: పరిసరాలను పరిశుభ్రంగ ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మూడోవార్డులో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టి కాలనీలో పర్యటించారు. కాలనీలు పరిశుభ్రంగా ఉంటే తద్వారా మున్సిపల్ పూర్తిగా స్వచ్ఛ మున్సిపల్‌గా మారుతుందన్నారు. మూడోవార్డు కౌన్సిలర్ మహమ్మద్ నిషాద్ రఫీక్, నాయకులు గాజుల రాజమల్లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబరాలు



ధర్మారం: పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ టికెట్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కేటాయించడంపై ధర్మారం మండలంలో పార్టీ నాయకులు మంగళవారం టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, నాయకులు పుస్కూరి రామారావు, తుమ్మల రాంబాబు, ఎండీ రఫీ, అమరపెల్లి నారాయణ, రాసూరి శ్రీధర్, దేవి రాజేందర్, పాకాల రాజయ్య, గుర్రం తిరుపతి, ఆవుల శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


మహిళా సాధికారిత సాధిద్దాం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మహిళా సాధికారిత సాధించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీకాలేజీలో మంగళవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం అమల్లో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యతతోనే చైతన్యం కలుగుతుందని స్పెషలిస్టు ఇన్ ఫైనాన్స్ లిట్రసీ సంధ్య అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంతకాల సేకరణలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సీతారెడ్డి ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ సతీశ్‌కు నివాళి

గోదావరిఖనిటౌన్: ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందిన పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ గాలి సతీశ్ కుటుంబాన్ని ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ గౌరవ అధ్యక్షుడు సోమారపు అరుణ్‌కుమార్ మంగళవారం కలిసి పరామర్శించారు. సతీశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న మంథని సీఐ వెంకటేశ్వర్లు

మంథని: మంథనిలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నేరాల నియంత్రణకు పట్టణంలో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.